# నా మతిలేని క్షణాలు

- ఏనుగు కిశోర్ బాబు

బస్ వచ్చి ఆగిందో, లేదో జనం తోసుకోసాగారు. దిగే వాళ్ళు దిగక ముందే ఎక్కేవాళ్ళు అవసరపడిపోతున్నారు. ముందుగా వెళ్తే ఏదైనా సీట్ దొరుకుతుం దన్న ఆశ కాబోలు! అప్పటికే కొన్ని హేండ్ బాగ్‌లు, కొన్ని దస్తీలు, మరికొన్ని న్యూస్ పేపర్లు కిటికీలలో నుంచి దూకి, తమ యజమానుల కోసం సీట్లను రిజర్వేషన్ చేశాయి కూడా.

ఎలాగైతే నేం నేనూ బస్‌లోకి ఎక్కగలిగాను. ఎక్కడం అనడంకన్నా తోసివేయబడ్డాను అనడం సబబుగా ఉంటుంది. జనం తాకిడికి బస్ మధ్యలోకి వచ్చాను. బస్ నిండా జనం ఉన్నారు. గాలి పీల్చుకునే సందు కూడా లేదు. బస్ కదిలింది.

అంత రష్‌లోనూ ఇద్దరు కూర్చునే సీటులో ఒక సీట్ ఖాళీగా ఉంది. అటువైపు చూశాను.

"ఈ సీటు మీ కోసమే ..." అంటూ నవ్వాడు సీటు ఆపిన తాలూకు వ్యక్తి. అతనికీ నా వయసే ఉంటుంది.

నా కోసం సీ టాపడానికి ఇత నెవరు? చటుక్కున కోపం వచ్చింది నాకు.

"అందమైన అమ్మాయి కనిపిస్తే చాలు వెధవ మగబుద్ధి ... సీ టాపాడట ..." అని తిట్టుకోసాగాను.

"బాగా రష్‌గా ఉంది. మీరు కింద ఉండగా చూసి, మీ కోసమే ఆపి ఉంచాను. కూర్చోండి. నేను లేచి నిలుచుంటాను ..." అంటూ లేవబోయాడు అతను.

"ఆఁ పరవాలేదు. మీరు కూర్చోండి ..." అని అసంకల్పితంగా అన్నాను నేను.

"ముఖం చూడు ... పెద్ద త్యాగబ్రహ్మలా ... రాజ్యాల్ని దానం చేసినట్లు పెద్ద పోజు ... వెధవ పోజు ..." అనుకున్నాను మనసులో.

"ఏమ్మా! కూర్చోరాదూ! రష్‌లో నిలుచుంటే బాగుందా?" వెనుక నుంచి గద్దించినట్లు ఒక గొంతు.

నిలుచోవడం నాకూ కష్టంగానే ఉంది. అందుకని నా వయస్సులోనే ఉన్న ముక్కూ మొఖం తెలియని వాడి పక్కన కూర్చోవడమా? నాకు నచ్చలేదు. పోవాల్సిన దూరం చాలా ఉంది. కనీసం గంటైనా పడుతుంది. ఆ గంటసేపూ ఈ రష్‌లో నిలబడాలంటే భయం వేసింది.

నేను తటపటాయిస్తున్నంతలో "నువ్వు కూర్చుంటే కూర్చో, లేకపోతే దారైనా ఇవ్వు! నే నైనా కూర్చుంటా ..." వెనుక నుంచి మీదకు ఒరుగుతూ మరొక మగ రాక్షసుడు అరిచాడు.

ఇంకా సీ టాపిన తాలూకు వ్యక్తి ఆహ్వానిస్తున్నట్లు చూస్తున్నాడు. అంతలో బస్ షార్ట్ టర్న్ తీసుకోవడంతో ఒరిగి, ఆ ఖాళీ సీట్‌లో పడిపోయాను నేను. ఇక లేవలేదు. అలానే కూర్చుండిపోయాను. బస్ టర్నింగ్ తీసుకోవడం వలన కూర్చున్నాననో, ఇష్టమయ్యే కూర్చున్నానో ఇంకా నాకు సందేహమే!

"వెధవ బుద్ధి - మగ బుద్ధి! అందమైన అమ్మాయి పక్కన కూర్చుంటే అ దో స్వర్గాన్ని జయించినట్లు ఫీలింగ్! మనసులో కసురుకున్నాను. కాలుతున్న పెనంపై కూర్చున్నట్లు ఉంది నాకు. "ఎవరైనా మా ఊరి వాళ్ళు చూస్తే ... అమ్మ బాబోయ్! ఎవడితోనో షికార్లు చేస్తోం దని పుకార్లు పుట్టించరూ?..." అని భయం వేసింది. 'ఎంత తెలివి తక్కువగా కూర్చుండిపోయాను' అని బాధపడసాగాను.

"తప్పు నాది కాదు. అసలు ఈ 'వెధవ' మనిషి ఇలా సీట్ ఆపి ఉంచకపోతే ఈ గొడవ అంతా వచ్చేది కాదు కదా! దుర్మార్గుడు, దుష్టుడు, నీచుడు ... న న్నిలా అవమానాల పాలు చేయడానికి అవతరించిన రాక్షసుడు ...' తిట్టుకోసాగాను నేను.

బస్సు కదులుతూనే ఉంది. ఆగిన ప్రతిచోట పదీ పాతిక మందిని కక్కి, పాతిక, ఇరవైమందిని మింగి ముందుకు కదులుతూ ఉంది.

నా కోసం సీ టాపిన 'రాక్షసుణ్ణి' చూశాను. కిటికీలో నుంచు వెలుపలకు చూస్తున్నాడు. అతనిని చూస్తే భలే కోపం వచ్చింది. "దొంగ ముఖం - వీడూనూ! ఏమీ ఎరుగని వాడిలా దొంగ పోజు. అందమైన ఆడపిల్ల పైట కొంగు రాసుకుంటే ఆనందం కాబోలు! పైకి మాత్రం నటన. అదే 'దివా!' అయితేనో? ...' వెంటనే దివాకర్ గుర్తుకు వచ్చాడు.

"దివాకర్! దివాకర్! చాలా మంచివాడు. అతని మాటల్లో ఎంత కవిత్వం? ఎంత ఆరాధన? ప్రతి ఉత్తరంలోనూ ఎన్నో విషయాలు సున్నితంగా చర్చిస్తాడు. ఎంత గుండ్రంగా, ముద్దుగా ఉంటాయి అతని అక్షరాలు. అతనికీ, ఇతనికీ పోలికేమిటి? నా పిచ్చి నాది కానీ ..." అనుకున్నాను దివాకర్ గుర్తుకు రాగానే!

దివాకర్ మా నాన్న గారి శిష్య కోటిలో ఒకడు అనే కన్నా ఉత్తముడు అనడం సరిగా ఉంటుంది. మా నాన్నగారికి అనుంగు శిష్యుడు. నాన్నగారు పట్నం పోయిన ప్రతి సారీ దివాకర్ ఇంటికి వెళ్ళి వస్తుంటారు. పైగా ప్రతి వారం ఒక లెటర్ మా ఇంట తప్పక వాలుతూ ఉంటుంది. ఎన్ని విషయాలు చర్చిస్తాడని!

నాన్నగారు బదులు వ్రాస్తూ, చెపుతుంటే నేను జవాబు వ్రాస్తుంటాను. ఎన్ని చర్చలో! ఎన్ని వేదాంత విషయాలో?

మళ్ళీ పక్కగా ఆ 'రాక్షసుణ్ణి' చూశాను. అతను నా వైపు చూస్తున్నాడు. నేను ముఖం చిట్లించాను కావా లనే!

"మీరు నెర్వస్ ఫీ లవుతున్నట్లుంది. డోన్ట్ ఫీల్ నెర్వస్! నే నేం పరాయివాణ్ణి కాదు ..." అన్నాడు నవ్వుతూ.

కిటికీలో నుంచి బయటకు దూకేద్దామా? అన్నంత కోపం వచ్చింది. 'పరాయివాడు కాదట! ఏదో పెద్ద మేనత్త కొడుకులా! పోకిరీ ముఖం వీడునూ!..' అంటూ మనసులోనే గొణుక్కున్నాను.

అంతలో అంత రష్‌లో 'ఉష్'మంటూ ఉన్న ఓ చిన్న పిల్లవాడు కనిపించాడు. ఏ డేళ్ళు ఉంటా యోమో! వాడిని పిలిచి, మా ఇద్దరి మధ్యగా కూర్చోపెట్టుకున్నాను.

గర్వంగా కిటికీ వైపు కూర్చున్న రాక్షసుణ్ణి ఓరగా చూశాను. ప్రత్యర్థిపై దెబ్బతీసిన దానిలా, నరకాసురుణ్ణి సంహరించిన సత్యభామలా ఆనందంగా ఉంది నాకు.

నా ఆనందాన్ని తనూ గమనించినట్లు అతని కళ్ళు నవ్వాయి.

వెంటనే తల తిప్పుకున్నాను. 'ఛీ! సిగ్గులేని దాన్ని. ముక్కూ మొహం తెలియని వాడితో కళ్ళతో మాట్లాడుతున్నాను' అని అనుకుని సిగ్గుపడ్డాను అర్థంటుగా.


తల వంచుకున్నాను. కళ్ళు అనాలోచితంగా మధ్యలో కూర్చున్న పిల్లవాణ్ణి గమనించసాగాయి. ఏదో కూలీ, నాలీ చేసుకుని బ్రతికే వాళ్ళ పిల్లవాడులా ఉంది. చిరిగిపోయి మాసిపోయిన బట్టలు, చెమట ఉప్పురిసిపోయి అసహ్యంగా ఉంది. మోకాలిపై పుండు రసికారుతూ ఉంది.

ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. తల ఎత్తి ఆ పిల్లవాడి ముఖంలోకి చూశాను. పుసులు అంటుకున్న కళ్ళు, చింపిరి జుత్తు ఎంతో అసహ్యంగా ఉన్నాడు. వాడి మోకాలి పై పుండు చూస్తే వాంతి వస్తోంది.

"వీడినా! ఈ ఎబ్రాసివాణ్ణా! పిలిచి మరీ పక్కన కూర్చోపెట్టుకున్నాను? వీ డెప్పుడు దిగిపోతాడ్రా దేవుడా! ' అని బాధపసాగాను. 'బస్ కాస్తా విమానమై మరో క్షణంలో మా ఊళ్ళో ఆగకూడదా!' అనుకున్నాను.

"అస లింతకూ, న న్నిలా ఇబ్బందులపాలు చేయడానికే ఆ రాక్షసుడు సీ టాపాడు. ఆ దౌర్భాగ్యుడే ఇందుకు కారణం! ఆ పోకిరీ వాడే ఇందుకు కారణం. ఇందుకు ప్రతిఫలంగా వచ్చే జన్మలో ఆడదై పుడతా డు...' అని శాపం కూడా ఇచ్చాను.

ఇంతలో బస్ కంచికచర్ల వచ్చింది. బిల బిలమంటూ చాలామంది బస్సు దిగిపోయారు. ఎక్కేవాళ్ళు ఎక్కువ లేనందున రష్ తక్కువైంది. ముందు లేడీస్ సీట్ ఒకటి ఖాళీ ఉంటే పరుగున



పోయి అక్కడ కూర్చున్నాను. ''హమ్మయ్య! ...'' గట్టిగా నిట్టూర్చి ఊపిరి పీల్చుకున్నాను.

''ఆ వుండుతో, ఆ ఏబ్రాసి పిల్లోడి పక్కన ఆ సీ టాపిన జీవం! ... అహ... అహ్హహ్హ ...' మనసులో చిలిపి ఆనందం వేసింది.

''అందమైన అమ్మాయి పక్కన కూర్చోవా లన్న ఆ అత్యాశాపరుడికి సరైన బుద్ధి వచ్చేలా పాఠం! దరిద్ర కుర్రోడి పక్కన ... వుండ్లతో ...' కినుక్కున నవ్వాను. పక్కన ఉన్న ఆవిడ వింతగా నా వైపు చూసింది. ఇకపై హాయిగా ప్రయాణం చేయవచ్చు నన్న ఆశ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

అది నిజమే అయింది. బస్ మా ఊర్లో ఆగింది. బస్ దిగడానికి లేచాను. పక్కన నా కోసం సీ టాపిన 'రాక్షసుడు' చేతిలో ఒక కవరు!

''విమలా! ఇవి మీ ఫొటోలు. నాన్నగారు పోయిన సారి వచ్చినప్పుడు ప్రింట్‌కు ఇచ్చారు. విజయవాడ పోయి, తిరిగి వచ్చేప్పుడు ఇద్దామని తీసుకు వస్తున్నాను. దారిలో మీరే కలిశారు. మళ్ళీ వచ్చేప్పుడు నాన్నగారిని కలుస్తా నని చెప్పండి!'' అంటూ కవర్ నా చేతిలో ఉంచాడు.

అప్రయత్నంగా కవర్ తీసుకుని బస్సు దిగాను. బస్ కదిలింది. కిటికీలో నుంచి అతను చేయి ఊపుతున్నాడు. అనుకోకుండా గాలిలోకి నా చేయి కూడా లేచింది. బస్ ముందుకు సాగిపోతోంది ''ది... వా... క... ర్!'' నిశ్శబ్దంగా నా పెదాలు గొణగడం నాకు తెలీదు! ★

